ప్రజాశక్తి

మంగళవారం 8 ఏప్రిల్ 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

అకాల వర్షం...భారీ నష్టం

- ఈదురుగాలులకు నేల రాలిన మామిడి
- గోడ కూలి కండెక్టర్ మృతి
- తెగిన విద్యుత్ తీగ - తప్పిన పెను ప్రమాదం
- పడిపోయిన హోర్డింగ్‌లు

ఎ.కొండూరు మండలంలో నేల రాలిన మామిడికాయలు

రెడ్డిదూడెం మండలంలో నీట మునిగిన ఇటుక బట్టీలు

ప్రజాశక్తి - ఎ.కొండూరు, రెడ్డిగూడెం, కంచికచర్ల, మైలవరం, జి.కొండూరు, విజయవాడ : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. రోడ్లపైకి, పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరింది. కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎ.కొండూరు, రెడ్డిగూడెం, మైలవరం తదితర ప్రాంతాల్లో మామిడి తోటలకు, నందిగామ, కంచికచర్ల తదితర ప్రాంతాల్లో మిర్చి రైతులకు నష్టం వాటిల్లింది.

జి కొండూరు మండలం పినపాక గ్రామంలో ప్రహరీ గోడ కూలి ఇబ్రహీంపట్నం డిపోకు చెందిన కండెక్టర్ ఉయ్యూరు మంగారావు (45) మరణించాడు. విజయవాడ సమీపంలోని నున్న పవర్ గ్రిడ్ సమీపంలో విజయవాడ–నూజివీడు రహదారిపై విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. ఇదే సమయంలో నూజివీడువైపు నుంచి వస్తున్న ఆర్టీసి బస్సు విద్యుత్ తీగకు అతి సమీపంలోకి వచ్చి ఆగిపోయింది. దీంతో పెనుప్రమాదం తప్పింది. మామిడి కాయలు రాలిపోవడంతో రైతులకు, వ్యాపారులు లబోదిబోమంటున్నారు. నల్లి తెగులుతో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న మామిడి రైతులను ఈదురు గాలులతో కూడిన వర్షం నిండా ముంచింది. మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. కొన్నిచోట్ల మామిడి చెట్లు సైతం కూలిపోయాయి. కేవలం మామిడిపై వచ్చే ఆదాయంతోనే జీవనం సాగించే సామాన్య, మధ్య తరగతి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది ఇప్పటికే మామిడికి పెట్టుబడుల రూపంలో రైతులు ఎకరానికి రూ.50 వేల వరకు ఖర్చు పెట్టారు. మామిడి తోటలను కొనుగోలు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వ్యాపారుల పరిస్థితీ దయనీయంగా మారింది. ఇటుక బట్టీలలోకి నీరు చేరడంతో ఇటుక వ్యాపారులు కూడా ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో మిర్చి, వరి రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు అవస్థలు పడ్డారు. మిర్చి కోతలు

మృతుడు మంగారావు

చివరిదశకు చేరాయి. కోసిన మిర్చి కల్లాల్లో ఆరబోశారు. దీంతో ఆరబోసిన మిర్చి తడవకుండా రైతులు హడావుడిగా పట్టాలు కప్పారు. అలాగే ఏటిపట్టు గ్రామాల్లో రబీలో సాగు చేసిన వరి పంట కోతకు వచ్చింది. ఈదురు గాలులకు వరి పంట పడిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెడ్డిగూడెం మండలంలో గత రాత్రి తీసిన ఇటుక పచ్చి మీద ఉండటంతో నేలమట్టమైపోయింది. మైలవరం ప్రాంతంలో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అప్పటి వరకు ఎండ తీవ్రతకు తట్టుకోలేక చెమట, ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు భారీ వర్షంతో సేదదీరారు. ఆయా ప్రాంతాల్లో చల్లని వాతావరణం నెలకొంది.

గోడ కూలి కండెక్టర్ మృతి

జి కొండూరు మండలం పినపాక గ్రామంలో ప్రహరీ గోడ కూలి ఆర్‌టిసి కండక్టర్ మరణించాడు. ఇబ్రహీంపట్నం బస్సు డిపోకు చెందిన కండెక్టర్ ఉయ్యూరు మంగారావు (45) ఈవినింగ్ వాకింగ్‌కు తోటి కండక్టర్లతో కలిసి వెళ్లాడు. సాయంత్రం 5.30 గంటల సమయంలో వర్షం ప్రారంభం కావడంతో వారు వెనుతిరిగి పినపాక రోడ్డులోని ఓ షెడ్లోకి పరుగు తీశారు. అయితే బలమైన ఈదురుగాలు వీయడంతో షెడ్డు గోడ కూలి సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. మతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జి.కొండూరు ఎస్ఐ సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెగిన విద్యుత్ తీగ - తప్పిన పెను ప్రమాదం
కూలిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు

విజయవాడ సమీపంలోని నున్న పవర్ గ్రిడ్ సమీపంలో విజయవాడ–నూజివీడు రహదారిపై విద్యుత్ తీగ తెగి రోడ్డుపై పడింది. ఇదే సమయంలో నూజివీడువైపు నుంచి వస్తున్న ఆర్టీసి బస్సు విద్యుత్ తీగకు అతి సమీపంలోకి వచ్చి ఆగిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దీనిని గమనించిన విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విజయవాడ ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బోర్డులు వాలిపోయాయి. కొన్ని చోట్ల చెల్లాచెదురుగా పడిపోయాయి.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి
- మాజీ మంత్రి వడ్డే రచించిన పుస్తకావిష్కరణ

విజయవాడ : పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ సినీనటుడు ఆర్ నారాయణమూర్తి కోరారు. మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రచించిన "ప్రభుత్వ పథకాలు – ప్రాధాన్యతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బహిరంగ లేఖ" పుస్తకాన్ని ఆయన సోమవారం ఆవిష్కరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఎఎస్ బండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆర్.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ అభివద్ధి ఒకటే కాదని, దీంతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాల అధికారాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గుంజుకుని వాటిని బలహీన పరుస్తోందన్నారు. రాష్ట్రాలు బలంగా ఉంటేనే కేంద్రం బలగంగా ఉంటుందన్నారు. రాజ్యాంగ (మిగతా 2లో)

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్.నారాయణమూర్తి; చిత్రంలో వడ్డే

ఎన్‌టిఆర్ వైద్య సేవలకు అంతరాయం

- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రెండు గంటలు నిలుపుదల
- ఆసరా పూర్తిగా నిలిపివేత
- రూ.22 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదల చేయని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్య సేవను కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. నెలల తరబడి బకాయిలు విడుదల చేయకపోవడంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) పిలుపు మేరకు నెట్ వర్క్ ఆస్పత్రుల్లో సోమవారం సుమారు రెండు గంటలకుపైగా వైద్య సేవలను నిలిపివేశారు. ఈ సమయంలో వైద్య సేవలకు ఆస్పత్రులకు వెళ్లిన పలువురు రోగులు ఇబ్బందులకు గురయ్యారు. ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి నిధుల విడుదలపై హామీ ఇవ్వడంతో సేవలను పునరుద్ధరించారు.

ఎనిమిది నెలలుగా పెండింగ్

కృష్ణాజిల్లాలో మొత్తం 19 ఎన్‌టిఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో మూడు, పెనమలూరులో ఎనిమిది, గుడివాడలో నాలుగు, కూచిపూడి, పామర్రు, ఉయ్యూరు, గన్నవరంలలో ఒక్కొక్కటి చొప్పున ఆస్పత్రులు ఉన్నాయి. ఈ పథకం కింద వైద్య సేవలు అందించినందుకుగాను ప్రభుత్వం మొత్తం రూ.22 కోట్లను ఆయా ఆస్పత్రులకు బిల్లుల రూపంలో విడుదల చేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఎనిమిది నెలలుగా బిల్లులు విడుదల చేయలేదు. బిల్లులు విడుదల చేయాలని కోరుతూ గత ఏడాది జూలై నుండి ఇప్పటి వరకు పలు దఫాలుగా కూటమి ప్రభుత్వానికి ఆషా ఆధ్వర్యాన విజ్ఞాపనలు అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం వైద్య సేవల నిలుపుదలకు ఆషా పిలుపు నిచ్చింది. ఈ క్రమంలోనే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రెండు గంటలపాటు వైద్య సేవలను నిలిపివేశారు.

ఆసరా నిలిపివేత !

ఆరోగ్య శ్రీలో కీలక వ్యాధులకు చికిత్స పొంది ఆస్పత్రి నుండి డిశ్చార్జి అయిన వారికి ఆసరా పథకం కింద రోజుకు రూ.225 వరకు ఇచ్చేవారు. రోగ తీవ్రత ఆధారంగా పక్షవాతం వచ్చిన వారికి రూ.30 వేలు, కేన్సర్ బాధితులకు ఆరు కిమోథెరఫీలకు రూ.25 వేలు వరకు ఆసరాలో అందించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసరాకు నిధులు నిలిపివేసింది. దీంతో ఎన్‌టిఆర్ ఆరోగ్య సేవలు పొందుతున్నవారికి సమస్యగా మారింది. దీంతో ఆసరాను పునరుద్ధరించాలని రోగులు కోరుతున్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

రూ.5 లక్షల జరిమానా

ప్రజాశక్తి - భవానీపురం : భవానీపురం సెక్షన్ పరిధిలో గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఇఇ పి.విజయకుమారి, విజయవాడ పట్టణ ఇంచార్జ్ ఈఈ హనుమయ్య ఆధ్వర్యంలో అధికారులు 42 బందాలుగా ఏర్పడి 3148 విద్యుత్ గహ, 366వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 146 సర్వీసులకు అదనపులోడు మొత్తానికి రూ5,68,800 జరిమానా విధించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 9440812362. 9440812363, 8331014951 ఫోన్ నంబర్లకు సమాచారం కోరారు. తనిఖీల్లో విజయవాడ పట్టణ డి 1 డిఈఈ. రామకష్ణ , ఏపి ఓ ప్రసాద్, ఏఈ.రామ ప్రసాద్, విజయవాడ పట్టణ డివిజన్ పరిధిలోని డిఈఈలు, ఏఈలు, జేఈలు, ఫోర్‌మెన్లు, లైన్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. గహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్‌ను రెగ్యులేషన్ చేసుకోవడానికి యాభై శాతం సబ్సిడీతో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

విద్యుత్ కనెక్షన్‌ను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారి

వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు, యూనియన్ నేతలు

విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఉద్యమం

భూ కబ్జా కేసులో వంశీకి ఊరట

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో శ్రీధర్ రెడ్డికి చెందిన భూమిని కబ్జా చేశారని కేసులో నిందితుడుగా ఉన్న మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీకి ఊరట లభించింది. సోమవారం గన్నవరం కోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఆత్కూరు పోలీసులు వంశీని మరో రోజు కస్టడీకి ఇవ్వాలని వేసిన పిటిషన్ కోర్టు కొట్టి వేసింది. టిడిపి కార్యాలయంపై దాడి కేసులో వంశీ... విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు, నాయకులు ఎం.వెంకటరెడ్డి, పి.వి.ఆంజనేయులు, జి.సీతారామిరెడ్డి, కె.కళ్యాణ్

ఎంటియు-1010 కొనుగోలుకు చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు రైతు, కౌలు రైతు సంఘాల వినతి

ప్రజాశక్తి - గంపలగూడెం : రబీలో వేసిన దాళ్వా వరి పంట ఎంటియు-1010 రకం కొనుగోలు చేయాలని కోరుతు ఆంధ్రప్రదేశ్ రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యాన సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గంపలగూడెం మండలంలో రబీసాగులో దాళ్వా వరి పంట 1010 రకాన్ని రైతులు సుమారు 3,120 ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. అది ఇప్పుడు కోతలు జరుగుతున్నాయని, కానీ కానీ ప్రభుత్వాధికారులు 1010 రకాలు కోనుగోలు చేయడం లేదని వివరించారు. వీటిని కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. తుపాన్ల కారణంగా కట్లేరు ప్రాంతంలో సంభవించిన వరద ముంపునకు గురై ఖరీఫ్‌లో వేసిన వరి పంటలను కోల్పోయి రైతులు పూర్తిగా నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పుడు రబీ పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులు మరింతగా నష్టపోతారని తెలిపారు. రబీలో వేసిన ఎంటియు-1010 రకాలను ప్రైవేట్ వ్యాపారులు కేవలం 78 కిలోల బస్తాను సుమారు రూ.1200 నుండి రూ.1250 వరకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు ఒక్కో బస్తాపై రూ.400 చొప్పున నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఎంటియు -1010 రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఎపి రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, పగడాల వీరాంజనేయులు, ఎపి కౌలు రైతు సంఘం ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు గువ్వల సీతారామిరెడ్డి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న విన్యాసాలతో నిరసన తెలుపుతున్న దృశ్యం

వ్యాయాయ ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - విజయవాడ : 2025 సంవత్సరం మెగా డిఎస్‌సిలో వ్యాయామ ఉపాధ్యాయుల (పిఇటి, పీడీలు) ఈవెంట్స్‌కు వెయిటేజ్ మార్కులు కలపాలని ఎఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి ఈశ్వరయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ అలంకార్ సెంటరు ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ వ్యాయామ, విద్య పోరాట సమితి (ఎపివివిపిఎస్), అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో అభ్యర్థులు పలు విన్యాసాలతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్ర గౌడ్ మాట్లాడుతూ వ్యాయామ విద్యలో క్రీడాకారులకు న్యాయం జరగాలంటే నిజమైన క్రీడాకారులకు అర్హత కలిగించే ఈవెంట్స్ మార్కులు కల్పించాలని కోరారు.

సంపద సృష్టి, వృద్ధిరేటుపై దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు, సమాజ అవసరాలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని.. సంపద సృష్టి, వద్ధిరేటుపై ప్రతి శాఖ అధికారులు కషిచేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణాంధ్ర విజన్-2047, వద్ధి ఇంజన్లపై జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు లక్ష్మీశ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జరిగిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జ్యోతి తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం కార్యక్రమానికి 152 అర్జీలు వచ్చాయి. ఈకార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 22 / 2024
O.S.No: 3 / 2023

బిట్వీన్ :
బండి వెంకట శివనాగసుధీర్ ... పిటిషనరు/వాది
V/s
కతారి రామాంజనేయులు (died) వగైరా
... రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

To,
R4). గంధం లక్ష్మి w/o గంగాధరన్,
D/o లేటు కతారి రామాంజినేయులు,
Door no. 20- 6- 135/B
అయోధ్య నగర్, విజయవాడ.

పైనెంబర్ దావాలో చనిపోయిన ప్రతివాదికి వారసులుగా నిన్ను 4వ ప్రతివాదిగా దావాలో చేర్పించమని వారసుల పిటిషను దాఖలు చేయగా సదరు పిటిషనులో మీకు నోటీసులు జారీ నిమిత్తం ది:16-4-2025 తేదీకి వాయిదా వేసినారు. సదరు విషయమై మీకు అక్షేపణలుండే ఎడల సదరు వాయిదా రోజున ఉదయం 10:30 నిముషములకు మీరు స్వయముగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ అక్షేపణలను తెలుపుకొనవలెను.లేని ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియపరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పుల్లెల హరిబాబు బి.ఎ.,ఎల్ఎల్.బి.,
అడ్వకేటు, కొత్తపేట,
చీరాల - 523 157.
సెల్ : 9948320308

నోటీసు

మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I. A.No. 21 / 2024
O.S.No: 3 / 2023

బిట్వీన్ :
బండి వెంకట శివనాగసుధీర్ ..పిటిషనరు/వాది
V/s
కతారి. రామాంజనేయులు (died) వగైరా
... రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,
R4) గంధం లక్ష్మి W/o గంగాధరన్,
D/o లేటు కతారి రామాంజినేయులు,
Door No. 20- 6- 135/B అయోధ్య నగర్,
విజయవాడ.

పై నెంబర్ దావాలో చనిపోయిన ప్రతి వాది కి వారసులుగా నిన్ను 4వప్రతివాదిగా దావాలో చేర్పించమని వారసులు పిటిషను దాఖలు చేయుటలో జరిగిన అబట్మెంట్ ఆర్డర్ ను రద్దు చేయమని కోరుచు పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటిషనులో మీకు నోటీసులు జారీ నిమిత్తం ది:16-4-2025 తేదీకి వాయిదా వేసినారు. సదరు విషయమై మీకు అక్షేపణ లుండేఎడల సదరు వాయిదా రోజున ఉదయం 10:30 నిముషములకు మీరు స్వయముగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ అక్షేపణ లను తెలుపుకొనవలెను.లేని ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియపరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పుల్లెల హరిబాబు, బి.ఎ.,ఎల్ఎల్.బి.,
అడ్వకేటు, కొత్తపేట,
చీరాల - 523 157.
సెల్ : 9948320308

జిల్లాస్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి - విజయవాడ : మాతా శిశు సంరక్షణ సమగ్ర సేవల వివరాల నమోదుకు రూపొందించిన హెచ్‌ఎంఐఎస్, ఆర్‌సిహెచ్ కార్యక్రమాలపై సోమవారం జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. రెండు రోజులపాటు జరిగే కార్యక్రమంలో డిఐఒ, డిపిఎంఒ, ఎస్ఒ, డివైఎస్ఒ, డిపిఒ, ఎంఐఎస్‌లకు శిక్షణ ఇచ్చారు. గుంటూరు జిల్లా చినకాకానిలోని హోటల్ హాల్యాండ్‌లో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ఎస్.అనిల్ కుమార్ అతిధిగా పాల్గొన్నారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ గణాంక విభాగపు డిప్యూటీ డైరెక్టర్ (డెమో గ్రఫీ) కే.శివశంకర బాబు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ కృష్ణాజిల్లా, మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు

I.A. No.22/2024 in I.A. No. 1089/2018 in O.S. No. 80/2010

బిట్వీన్ :
రావి శ్రీనివాసరావు ... పిటీషనర్/3వ పార్టీ
మరియు
శిష్ట కామేశ్వరమ్మ మరియు 5గురు ఇతరులు
.... రెస్పాండెంట్సు / పిటీషనరు/ డిఫెండెంట్

R4) నిమ్మగడ్డ వరలక్ష్మి, భర్త : గణేష్‌శాస్త్రి, హిందూ, వయస్సు 68 సం॥లు, గృహిణి, నివాసం: డోర్ నెం.42-4-92/3, పాత పోస్టాఫీసు దగ్గర, రామకృష్ణాపురం, విజయవాడ. .... రెస్పాండెంట్-4.

పై నెంబరు పిటీషనులో ఐ.ఎ. నెం. 22/2024లో మీరు 4వ రెస్పాండెంటు అయివున్నారు. కోర్టువారి నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను, తీసుకొనక కాలయాపన చేసినందున మీకు ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు చేసియున్నారు. కావున ది. 17-4-2025న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ హాజరయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనిపక్షంలో మీకు పరోక్షంగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది : 17-4-2025

పుప్పాల శివరామకృష్ణప్రసాద్
పిటీషనరు తరపు న్యాయవాది
మచిలీపట్నం **మచిలీపట్నం.**
ది.7-4-2025 **సెల్ : 9440014076.**

పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తోందన్నారు. ప్రస్తుత పరిస్థితిలో డీలిమిటేషన్ సరికాదన్నారు. పుస్తక రచయిత వడ్డే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఆచరణలో సాధ్యం కాని పథకాలను రూపొందించడం మంచిది కాదన్నారు. ప్రజల అభివద్ధికి, సంక్షేమానికి ఉపయోగపడని పథకాల కోసం పేద ప్రజలపై భారాల మోపుతోందన్నారు. అవసరం లేని పథకాలకు నిధుల వెచ్చింపు సరికాదన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఖర్చు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ప్రాజెక్టుల సాధన సమితి నాయకులు బొజ్జ దశరథరామిరెడ్డి, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, సింహాద్రి ఝాన్సీ, డి.హరనాథ్, పి.జమలయ్య పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింట్లు శ్రీమతి దాసరి సుశీల, శ్రీ నాగులపల్లి రాజా బెన్‌హర్, శ్రీమతి పర్వతనేని దుర్గారాణి, శ్రీ దాసరి సునీల్, శ్రీ సుంకర సుబ్బారావు R/o ఆముదాలపల్లి, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా వారి తరపున తెలియజేయునది ఏమనగా, వారు వారి తాలూకు ఈ క్రింద చూపిన ఆస్తులను అమ్మకమునకు పెట్టినారు.

విస్తీర్ణం	R.S.No.	గ్రామం	SRO Limits	ల్యాండ్ యజమాని
1) Ac.0.15	105/2	ఆముదాలపల్లి ఉంగుటూరు మండలం కృష్ణాజిల్లా.	గన్నవరం	దాసరి సుశీల
2) Ac.1.50	103/2 104/3	ఆముదాలపల్లి	గన్నవరం	- డిటో-
3) Ac.0.85	105/2	ఆముదాలపల్లి	గన్నవరం	నాగులపల్లి రాజాబెన్‌హర్
4) Ac.2.00	104/3	ఆముదాలపల్లి	గన్నవరం	1) పర్వతనేని దుర్గారాణి 2) దాసరి సునీల్ 3) సుంకర సుబ్బారావు H/o Late మణికుమారి
5) Ac.0.50	105/2	ఆముదాలపల్లి	గన్నవరం	పర్వతనేని దుర్గారాణి

ఈ ఆస్తులను మా క్లయింట్లు అమ్ముకొనుటలో ఎవరికైనా ఎట్టి అభ్యంతరాలుగాని, పరిహారాలు గానీ వున్న యెడల ఈ పబ్లికేషన్ వెలువడిన తేదీ నుండి వారం రోజుల లోపు ఈ క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేయవలసినదిగా కోరటమైనది.

గన్నవరం. **ఎస్.టి.జి. నీరజ**
ది.7-4-2025 **జి.రవికుమార్,**
అడ్వకేట్స్, గన్నవరం
సెల్ : 9394834166

గ్రామ పంచాయతీ కార్యాలయం, గండిగుంట

షార్టు టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 02/టెండరు/2025 **ది. 07-04-2025**

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామ పంచాయతీ నందు 2025-26 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు ఈ దిగువ షెడ్యూల్‌లో చూపిన ప్రకారం కాంట్రాక్టు ఏజన్సీ పద్ధతిపై (7) పోస్టులకు గాను 30 మంది పనివాళ్ళను సప్లయి చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు ది. 11-4-2025 తేదీ శుక్రవారం ఉదయం 11-30 గం.ల నుండి మధ్యాహ్నం 1.00 గం.ల వరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి గారిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచేగానీ సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 2-00 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండరు షెడ్యూలు ది. 11-4-2025న ఉదయం 11-00 గం.ల నుండి మధ్యాహ్నం 01-00 గం.ల వరకు ధరావత్తు చెల్లించిన వారికి మాత్రమే ఇవ్వబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చును. ప్రభుత్వం వారి షరతులకు లోబడి టెండర్లు దాఖలు చేయవలెను. టెండర్ల షెడ్యూలు మరియు మిగిలిన వివరములు పంచాయతీ కార్యాలయ పనివేళల్లో తెలుసుకొన వచ్చును. టెండర్లు రద్దుపరచుటకు లేదా అనుమతించుటకు పంచాయతీ కార్యదర్శి వారికి అధికారం కలదు.

వ.నెం.	పని వివరం	పోస్టు పేరు	లింగము	సంఖ్య	కాలపరిమితి	ధరావత్తు
1.	రోజువారి వీధులు ఊడ్చుట	స్వీపర్లు	స్త్రీలు	6	1-4-2025 నుండి 31-3-2026 వరకు (1 సం॥ కాలము)	
2.	రోజువారీ రిక్షాలతో, వ్యానులతో మరియు ట్రాక్టరుతో చెత్త సేకరణచేయుట	క్లాప్ మిత్రాలు	పురుషులు	13	-డిటో-	
3.	రోజువారీ ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డు వద్ద కంపోస్టు తయారీ ఇతర పనులు	షెడ్డు మిత్రాలు	పురుషులు	2	-డిటో-	
4.	రోజువారీ చెత్త వ్యాను మరియు ట్రాక్టరు నడుపుటకు	డ్రైవర్లు	పురుషులు	2	-డిటో-	రూ.5000
5.	రోజువారీ రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణ	పంపు ఆపరేటర్లు	పురుషులు	5	-డిటో-	
6.	రోజువారీ వీధి దీపముల ఆన్-ఆఫ్ మరియు రిపేర్లు నిర్వహణ	ఎలక్ట్రీషియన్	పురుషులు	1	-డిటో-	
7.	రోజువారీ పిడబ్ల్యుఎస్ పైపు లైనుల రిపేర్లు	ఫిట్టరు	పురుషులు	1	-డిటో-	
	మొత్తము			30		

గమనిక : 1) పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీకి సంబంధించిన అన్ని పనులు చేయుటకు పనివారు అంగీకారం తెలుపవలెను. 2) పంచాయతీ కార్యదర్శి అప్పగించిన ఏ పనైనను సకాలంలో పనివారు చేయవలెను. ఎదురు చెప్పరాదు. 3) గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి ఏజెన్సీ వారికి పైకము చెల్లించబడును. ఎటువంటి మాదరా ఇవ్వబడుదు. 4) పారిశుధ్య పనివారు రోజుకి 8 గం.లు పని చేయవలెను. మిగతా పోస్టుల వారు ఎమర్జెన్సీని బట్టి అదనపు గంటలు పనిచేయవలసి వచ్చును. 5) పనివారలకు కల్పించవలసిన అదనపు సౌకర్యాలు ఏమైనా వున్న యెడల గ్రామపంచాయతీలో గల నిధుల లభ్యతను బట్టి ఏర్పాటు చేయబడును. 6) టెండరు దాఖలు చేసిన ఏజెన్సీ దారుడు సకాలంలో పనివారలను సరఫరా చేయని యెడల అతని టెండరును రద్దుచేసి ప్రభుత్వం వారి ఉత్తర్వులననుసరించి తదుపరి చర్యలు గ్రామపంచాయతీచే తీసుకొనబడును. 7) గ్రామపంచాయతీకి ఏజెన్సీ దారుడి వలన ఏదైనా నష్టము జరిగిన యెడల నష్టపరిహారమును మరియు అపరాధ రుసుమును విధించి వసూళు చేయుటకు హక్కు గ్రామపంచాయతీకి కలదు.

సం// గెత్తం అనుపమ, సర్పంచ్
గ్రామ పంచాయతీ, గండిగుంట

సం // సి.కుమార్‌రావు, పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ, గండిగుంట

వక్ఫ్ చట్టసవరణపై నిరసనలు

చల్లపల్లిలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టసవరణ బిల్లును ఆమోదించడంలో ఎపి, బీహార్ సిఎంలు చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు ప్రకటించారని, ముస్లిం మైనారిటీల శక్తి ఏమిటో వారికి చూపిస్తామని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ హెచ్చరించారు. చంద్రబాబు, నితీష్ తక్షణమే కేంద్రంతో మాట్లాడి బిల్లు ఉపసంహరించుకునేలా చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. వక్ఫ్ చట్టసవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం సమైక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక రాజుపేట షాది ఖానా నుండి కోనేరు సెంటర్‌కు ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. సిపిఎం, సిపిఐ. ఆవాజ్ తదితర వామపక్షాలు మైనారిటీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత హయాంలో నల్లచట్టాలు తీసుకొచ్చి రైతులను దగా చేసేందుకు ప్రయత్నించిందన్నారు. దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమించి ఢిల్లీని గడగడలాడించిన పరిస్థితుల్లో వెనక్కు తగ్గిందన్నారు. అలాగే వక్ఫ్ సవరణ బిల్లు కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకునేలా మైనారిటీలు చేసే పోరాటంలో సిపిఎం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు కొడాలి శర్మ, నగర కమిటీ సభ్యులు సిహెచ్ జయరావు, సమైక్య వేదిక సభ్యులు అంజద్ బాషా, కడప ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిముల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉన్నందున బిల్లును వెనక్కి తీసుకోవాలని జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు షేక్ నసీం ఘోరీ డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు వెనక్కి తీసుకోవాలని కోరుతూ చల్లపల్లిలో సోమవారం ముస్లింలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జామియా మసీద్ నుండి వందలాదిగా ముస్లింలు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ డి.వనజాక్షికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నసీంఘోరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం ఆస్తులపై, సంస్థలపై, తమ అధికారాలపై దాడిచేసే విధంగా రూపొందించబడిందని ఆందోళన వెల్లిబుచ్చారు. ఈ చట్టపరమైన మార్పులు మైనారిటీల హక్కులను క్రమంగా క్షీణింప చేసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సవరణ బిల్లును వెనక్కి తీసుకొని ముస్లిముల మనోభావాలను కాపాడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్బు షరీఫ్, మగబుల్ సాబ్, ఆలిం రజ, మీర్ రిజ్వాన్, పఠాన్ కరీముల్లా ఖాన్, మహమ్మద్ కరీముల్లా, కమాల్, హమీద్, జహీర్ మాస్టర్,అర్షద్, రౌఫ్, గయాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు మద్దతు తెలిపారు.

ఆటో బోల్తా : ఒకరు మృతి

ప్రజాశక్తి-నందివాడ: మండలంలోని పుట్టగుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. మరో ముగ్గురు గాయాల పాలయ్యారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... గుడివాడలో ఓ కార్పొరేట్ పాఠశాలలో వంట పని ముగించుకుని అరిపిరాల గ్రామానికి తిరిగి వస్తుండగా పుట్టగుంట సమీపంలో ఆదివారం రాత్రి గేదెలు రావడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో కొసనం నరసింహరావు (48) మృతిచెందాడు. ఆటో డ్రైవర్ రామకూరి పవన్ కుమార్, కాటుమాల జయమ్మ, పొనుకుమాటి మణిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుడివాడ ఏరియా హాస్పిటల్‌కి తరలించి చికిత్స అందించిన వైద్యులు ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. ఎస్ఐ శ్రీనివాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక గుడివాడ రైల్వే స్టేషన్ నుండి మోటూరు రైల్వేగేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ ఎం.షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వయసు సుమారు 25-35సంవత్సరాలు ఉంటుందని, మృతుని ఆచూకీ తెలిసిన వారు గుడివాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి పలువురికి గాయాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: ఇసుకలోడుతో వేగంగా వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన కూర్చున్న వ్యక్తులపై దూసుకెళ్లి ప్రమాదం జరిగిన సంఘటన సోమవారం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డ కొత్తపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. మోపిదేవి ఎస్ఐ వైవివి సత్యనారాయణ కథనం మేరకు రోడ్డు పక్కన ఉన్న సిమెంట్ బల్లలు పై కూర్చుని ఉన్న పడమట మాణిక్యాలరావు, పడమట నాగరాజు, పడమట రాఘవేంద్రరావు, పడమట రామకష్ణ, పడమట ఫణింద్ర, మల్లవోలు అశోక్, జంపాన నాగమల్లి మీదకు ట్రాక్టర్ అదుపుతప్పి దూసుకు రావడంతో గాయాలకు గురయ్యారు. 108 లో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాల కు తరలించారు ప్రమాద సంఘటనపై పడమట మాణిక్యాలరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మండలి వెంకట్రామ్ పరామర్శించారు.

మెడికల్ కళాశాలకు ప్రభాకరరావు భౌతికకాయం

ప్రజాశక్తి-చల్లపల్లి: విశ్రాంత ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ ప్రభాకర్‌రావు భౌతిక దేహాన్ని చిన్న ఆవుటపల్లి మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు. నేత్రాలను ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు కార్నియాలను సేకరించారు. ప్రభాకరరావు తన ఉపాధ్యాయ జీవితంలో ఎంతో మంది విద్యార్థులను చదివించడంతో పాటు, మరి కొంతమంది విద్యార్థులను ఉన్నత చదువులు చదివించి సొంత బిడ్డల్లా చూసుకున్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో కషి చేశారు. ప్రభాకరరావు భౌతిక కాయాన్ని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పూర్వ విద్యార్థులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సంతాప సభలో డాక్టర్ డి ఆర్ కె ప్రసాద్, డాక్టర్ కుంభ రత్నగిరి, హనుమాన్ల సురేంద్రనాథ్ బెనర్జీ, దాసి సీతారామరాజు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

చింతలమడ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-చల్లపల్లి: అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో చింతలమడ ప్రధాన రహదారి మరమ్మతులకు నోచుకుంది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడ గ్రామంలో ఈ నెల 11, 12, 13 తేదీలలో మారెమ్మ తల్లి సంబరాల నేపథ్యంలో ప్రధాన రహదారికి మరమ్మత్తులు చేశారు. ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు, వాహనాలు రానున్న నేపథ్యంలో లక్ష్మీపురం - చింతలమడ రోడ్డు సమస్యను శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఎంఎల్ఎ సూచన మేరకు మేరకు లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు గుంతలు పూడ్చడానికి గ్రామ పంచాయతీ నుంచి రూ.రెండు లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించారు. తద్వారా పనులు చేపట్టారు. ఈ పనుల్లో గ్రామస్థులు సైతం భాగస్వాములై శ్రమదానం చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలంలో పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సోమవారం పరామర్శించారు. ఇటీవల కోడూరు 9వ వార్డులో మృతిచెందిన చేబోయిన కృష్ణమూర్తి, దేవనబోయిన భారతరావు, ఉల్లిపాలెంలో మృతిచెందిన ఉప్పాల యేసు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల జడ్పిటిసి యాదవరెడ్డి, వెంకట సత్యనారాయణ, మండల అధ్యక్షులు పరిసె మాధవరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-అవనిగడ్డ

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అవనిగడ్డ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా మండల రెవెన్యూ కార్యాలయం పక్కన చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం ఈ చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా ఎంపీడీవో ఎం మరియాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ వారు పాఠశాల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ అరుణకుమారి, పంచాయతీ ఈవో బి అనిత పాల్గొన్నారు.

కళారత్న పురస్కార గ్రహీత గుత్తికొండకు సత్కారం

ప్రజాశక్తి-గుడివాడ : కళారత్న పురస్కార గ్రహీత గుత్తికొండ సుబ్బారావు అభినందన సభ స్థానిక పుట్టి నాగలక్ష్మ గహంలోని కళామందిర్లో సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఉగాది పండుగనాడు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా సాహితీవేత్త గుత్తికొండ సుబ్బారావు కళా రత్న పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పుట్టి వెంకటేశ్వర్రావు సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆయనను అభినందించి ఘనంగా సత్కరించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణచంద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ఎంతోమంది రచయితల సాహితీ పుస్తకాలకు సహకారం అందించి పుస్తకాల రూపంలో వెలువడెందుకు ప్రోత్సహించిన వ్యక్తి గుత్తికొండ అని కీర్తించారు. సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టి నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో అక్కినేని నాగేశ్వరావు కళాశాల కరస్పాండెంట్ కెఎన్ అప్పారావు,

విశ్రాంత ప్రాచార్యులు ఎంవిజి ఆంజనేయులు, అన్నపూర్ణ వద్ధాశ్రమం అధ్యక్షురాలు కరెడ్ల సుశీల(మచిలీపట్నం), విశ్రాంత చరిత్ర అధ్యాపకులు కోగంటి గాంధీ బాబు, విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ కొడాలి సోమ సుందర్రావు, భారతీయ సమితి అధ్యక్షులు డిఆర్‌బి ప్రసాద్, భావతరంగిణి సాహిత్య సంస్థ అధ్యక్షులు భవిష్య శ్రీ భాగ్య విధాత చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ బండారు శ్యామ్ కుమార్, విద్యార్థి వికాస వాహిని అధ్యక్షులు వేములపల్లి కేశవరావు, ఆర్‌విఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ఆంధ్ర రాష్ట్ర ప్రతిష్టాత్మక కళారత్న పురస్కార్ అవార్డు (హంస అవార్డు)గ్రహీత గుత్తికొండ సుబ్బారావుకు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేసినట్లు భాగ్య విధాత చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ తెలిపారు. మండలంలోని సింగలూరు బండారు బ్రహ్మ రావు, సీతామహాలక్ష్మి మెమోరియల్ కమిటీ హాల్లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు ఈ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి-నాగాయలంక: నాగాయలంక మండలం బర్రింకల గ్రామ పరిధిలో ఉన్న విరుగులమ్మ అమ్మవారి గుడి సమీపంలో పేకాట శిబిరంపై ఎస్ఐ రాజేష్, సిబ్బంది దాడి చేవారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.3,840 స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీరామనవమి సందర్భంగా అన్నదానాలు

ప్రజాశక్తి-పామర్రు(గుడివాడ) : పామర్రు మండలం ఉండ్రపూడి-పోలవరం క్రాస్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీవీరాంజనేయ స్వామివారి దేవస్థానంలో శ్రీరామ నవమి మహోత్సవాల సందర్భంగా మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా స్వామివారిని దర్శించుకుని అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. అనంతరం జరిగిన కోలాటంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో పివిఎన్‌వి ప్రసాదరావు నాయకులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, నీటిపారుదల ప్రాజెక్టు కమిటి వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తాడిశెట్టి వెంకటేశ్వరరావు, మట్టా వెంకటేశ్వరరావు, వెన్నా శ్రీనివాసరావు, దాడి పవన్ కుమార్. కూనపరెడ్డి సుబ్బారావు, ఈడే గంటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో సోమవారం అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో రామాలయం వద్ద నాలుగు వేల మందికి అన్న ప్రసాదాలు అందజేయగా మండల పరిధిలోని వేకనూరు పంచాయతీ శివారు గుడివాకవారిపాలెంలోని రామాలయం వద్ద 1500 మంది అన్నప్రసాదాలు అందజేశారు. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కావలసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్న సమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్

సిపి కార్యాలయంలో 83 ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలోని జిల్లా పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" నిర్వహించారు. ఉదయం 10 నుండి 1 గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిసిపి ఏ.బి.టి.ఎస్.ఉదయారాణి మొత్తం 83 ఫిర్యాదులపై బాధితులతో మాట్లాడారు.

మంచి ఆహారపు అలవాట్లపై పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : మంచి ఆహార అలవాట్లతో పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. ప్రపంచం ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తల్లి బిడ్డ ఆరోగ్య సంరక్షణ, ప్రాధాన్యతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో డిఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, డిఆర్‌డిఏ పిడి నాంచారయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.యం.సుహసిని, డిప్యూటి డియంఅండ్ హెచ్‌వో డా. ఉషారాణి, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారిణి జి.జ్యోతి పాల్గొన్నారు.

అధికారులతో ఎంఎల్ఎ వసంత సమీక్ష

విజయవాడ : వేసవి దృష్ట్యా ప్రజలకు, రైతులకు తాగునీరు, సాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు అధికారులను ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని తన కార్యాలయంలో జలవనరుల శాఖ,(ఇరిగేషన్), గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్.డబ్ల్యూ.ఎస్) అధికారులతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

స్పోర్ట్స్ క్లబ్ కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం స్పోర్ట్స్ క్లబ్ కోసం లంక భూముల్లో సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్థల పరిశీలన చేశారు. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి పంచాయతీ పరిధి చిన్నలంక, గుంటూరు జిల్లా తాటికొండ నియోజకవర్గం పెద్దలంక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను వారు పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఏ మేరకు ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో మూలపాడులో గోల్ఫ్ కోర్టు కట్టే ఆలోచన చేసిన ప్రభుత్వం ఇప్పుడు లంక భూముల్లో స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసే ఆలోచనతో ఆ భూములను పరిశీలన చేసినట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో ఆర్‌డిఓ చైతన్య, తహశీల్దారు వెంకటేశ్వర్లు, పలువురు టీడీపీ, కూటమి నాయకులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

టిడిపి ఎస్‌సి సెల్ సమావేశం

విజయవాడ : టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ విస్తృత స్థాయి సమావేశం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ భవనం ఎన్టీఆర్ భవన్ సోమవారం జరిగింది. ఈ సమావేశానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బడుగుబలహీన వర్గాల ప్రజలకు విద్య, వైద్యం, ఇతర మౌళిక వసతులకు చేయూతగా వుండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూపొందించిన పీ4 కార్యక్రమం ఒక విప్లవాత్మకమైన మార్పు తెస్తుందని, సమాజంలోని ఆర్థిక అసమానతలను తొలగిస్తుందని ఎంపి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, నాయకులు తాటి రామారావు, మందా మురళీ, బి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఐక్య సదస్సు

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రేమ, కరుణకి ప్రతిరూపం ఏసుక్రీస్తు శాంతి, క్షమాగుణానికి ప్రేరణ వారి బోధనలు, శత్రువుని కూడా ప్రేమించు, ప్రశ్నతాపానికి మించిన శిక్ష లేదని బోధించిన మహోన్నతుడు ఏసు ప్రభువు అని, వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. పెనుగంచిప్రోలు మండలాల్లో పొన్నవరం గ్రామంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళిని సత్యపథం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గనిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు వూట్ల నాగమణి, వూట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర ఎంపిపి సంఘాల అధ్యక్షుడు మార్నపూడి గాంధీ, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, నియోజకవర్గ కార్మిక విభాగ అధ్యక్షులు మోరెండ రామారావు, ఎంపిటీసీ కీసర లోకేష్, మాజీ విజయవాడ కనకదుర్గ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నంబూరి రవి, మాజీ మార్కెట్ యార్డ్ కమిటీ మెంబర్ పింగళి నరసింహారెడ్డి, మన్నే అప్పారావు, తదితరులు పాల్గొన్నారు

ఆశా వర్కర్ల విస్తృత సమావేశం

ప్రజాశక్తి - మైలవరం : ఆశా వర్కర్ల మైలవరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో సోమవారం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆశ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ పేద ప్రజలకు కోవిడ్ టైంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పనిచేసి ప్రపంచ ఆరోగ్య సంస్థ చేత ప్రశంసలు అందుకున్న ఆశ వర్కర్లకు నేటి కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచకపోగా ఎన్‌హెచ్‌ఎం నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశాలు తిరుపతమ్మ, సులోచన, సునీత, జ్యోతి, మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాలకు చెందిన ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మైలవరంలో జరిగిన ఆశ వర్కర్ల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న కమల

మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ మోహన రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో ఓ ఛానల్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొండపల్లి మున్సిపాలిటీ కమీషనర్ రమ్య కీర్తన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ బి.రమ్యకీర్తన అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెగా మెడికల్ క్యాంపు నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజలు ఈ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రసూతి, స్త్రీల వ్యాధి నిపుణులు డాక్టర్ ఎం.మైత్రి మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని చెప్పారు. ప్రముఖ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎం.నవీన్ కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మామిడి రత్న మోహనరావు మాట్లాడుతూ మెగా మెడికల్ క్యాంపులో ఎక్కువ మంది మోకాలు నొప్పుల బాధితులను గుర్తించి పరీక్షించి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ మెడికల్ క్యాంపులో సుమారు 200 మందికి బ్లడ్ షుగర్, సీరంక్రియాటినిన్, బోన్ డెన్సిటోమెట్రీ (ఎముకల్లో సాంద్రత), కార్డియాలజిస్టు పరీక్ష, ఈసీజీ, ఎకో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ మామిడి సీతారామారావు, అనస్థీషియా డాక్టర్ పల్లవి, కొండపల్లి మాజీ సర్పంచ్ వెనిగళ్ళ అమ్మాజీ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండా

ఎపిఎన్‌జిఒ రాష్ట్ర నేతలు శివారెడ్డి, విద్యాసాగర్ - ఎన్‌టిఆర్ జిల్లా నూతన అధ్యక్షులుగా సత్యానారాయణరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఏపిఎన్‌జివో అసోసియేషన్ పనిచేస్తుందని ఏపిఎన్‌జివో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వి.శివారెడ్డి, ఎ.విద్యాసాగర్ తెలిపారు. ఇప్పటికే పిఆర్‌సి ఛైర్మన్ నియామకం, పెండింగ్ డిఎలు మంజూరు వంటి సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లామన్నారు. ఎపిఎన్జీజీవో అసోసియేషన్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం గాంధీనగర్‌లోని ఏపిఎన్‌జివో హోంలో జిల్లా సహ అధ్యక్షులు పి.రమేష్ అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎ.విద్యాసాగర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన నేపథ్యంలో ఖాళీ అయిన జిల్లా అధ్యక్ష పదవికి ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా భాధ్యతలు నిర్వహిస్తున్న డి.సత్యానారాయణ రెడ్డిని జిల్లా అధ్యక్షులుగానూ, సహాధ్యక్షులుగా వి.వి.ప్రసాద్, కార్యదర్శిగా పి.రమేషలను కార్యవర్గం కో-ఆప్షన్ పద్ధతిలో ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సమావేశంలో శివారెడ్డి, సాగర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కారించాలని రాష్ట్ర జెఎసి నేతలు ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఈసమావేశంలో ఎపిఎన్‌జిఒ రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు రంగారావు, జి. శ్రీనివాసరావు, ఎస్.సూర్యం, జి సురేష్ నాయుడు, బి. సతీష్ కుమార్, వి.నాగార్జున, యం.రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన వారిని అభినందిస్తున్న దృశ్యం

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి :ఎంపి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అమరావతి రాజధాని ప్రాంతంలో రాబోయే అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు వారి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. మేరీస్ స్టెల్లా కాలేజీలో ఫైనలియర్ స్టూడెంట్స్‌కి సోమవారం ఏర్పాటు చేసిన నావిగేట్ ది కెరియర్ ఆఫ్టర్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్‌కి ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. మైక్రో బయోలాజీ చదివే దివ్య, టూరిజం చదివే సిస్రా, లైఫ్ సైన్స్ చదివే ప్రియ, అగ్రికల్చర్ బిఎస్‌సి చదివే మాధురీ, బిఎ చదివే ఐశ్వర్య, బిఎ జర్నలిజం చదివే హర్షిణి ఉద్యోగావకాశాలు, ఎంటర్ ప్రెన్యూర్స్‌గా కావటానికి ప్రభుత్వం అందించే సహకారం గురించి అడిగిన ప్రశ్నలకు ఎంపి కేశినేని శివనాథ్ సవివరంగా సమాధానాలు ఇచ్చారు. విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ అందించే ది స్కిల్ షాప్‌కి చెందిన కెరియర్ కౌన్సిలర్‌ను పిలిపించి విద్యార్థులకు సందేహాలను నివృత్తి చేయించారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేయిస్తానని. కేశినేని ఫౌండేషన్ ద్వారా కెరియర్ కౌన్సిలర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎపిలో ఎన్నో సంస్థలు మెకానికల్ సంస్థలతో పాటు ఆటోమొబైల్ సంస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సంస్థలు, డిఫెన్స్ టెక్నాలజీ పరిశ్రమలు పెట్టబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జెస్సింతా క్వాడ్రస్, మార్స్ ట్రస్ట్ చైర్మన్ సూజీ, కెరియర్ కౌన్సిలర్ సంపత్ తాజ్ మణి, కోమండూరి శేషసాయి రామ్ కౌశిక్, చార్టెడ్ ఎకౌంటెంట్ పర్వేజ్, ఎమ్.ఎస్.ఎమ్.ఈ జిల్లా ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మాదిగాని గురునాథం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపి కేశినేని చిన్ని

మాజీ ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి సభ్యులు గోళ్ళ భూషయ్య సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆయన నివాసానికి వెళ్లి భూషయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, మన్నే అప్పారావు, గోళ్ళ తిరుపతయ్య, నలగోళ్ళ లక్ష్మీ నారాయణ, తదితర నాయకులు నివాళు లర్పించారు.

విఎంసిలో 14 ఫిర్యాదులు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రతి సమస్యకు శాశ్వతమైన పరిష్కారాన్ని అందించాలని విజయవాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. వేదికలో 14 ఫిర్యాదులు అందయి. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సజన, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్య కుమారి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నగరంలో విస్తృతంగా డీ సిల్టింగ్ పనులు

ప్రజాశక్తి - విజయవాడ : నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు జరుగుతున్నాయని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం సర్కిల్ వన్ పరిధిలో 46వ డివిజన్ ఐరన్ యార్డ్, 44వ డివిజన్ బైపాస్ రోడ్‌లో, సర్కిల్ 2 పరిధిలో సింగ్‌నగర్ ఫ్లైఓవర్ నుండి నూజివీడు రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాంతాలలో గల బొట్కాల్స్ డ్రైనల్, సర్కిల్ 3 పరిధిలో గల గుణదల ఆటోనగర్ గుంటతిప్ప డ్రైనలో డీసిల్టింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

కొనకంచిలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలోని కొనకంచి గ్రామంలో బాపట్ల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందించారు. బీసీ కాలనీలో వయ్యారిభామ మొక్కల గురించి అవగాహన కల్పించి వాటి వల్ల కలిగే హాని నివారణ చర్యలను వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిన్నం మార్కండేశ్వర రావు, కసుకుర్తి దశరథ రామారావు, ఎర్రం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ గోశాలకు వరిగడ్డి

ప్రజాశక్తి - వత్సవాయి : శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోశాలకు స్థానికుడు ఆలయ మాజీ ధర్మకర్త సముద్రాల లక్ష్మీపతి కుమారుడు సముద్రాల వీర రాఘవులు సుమారు పదివేల రూపాయలు విలువ చేసే వరి గడ్డిని విరాళంగా అందజేశారు. దాతను శేష వస్త్రాలతో, ప్రసాదాలతో ఆలయ కమిటీ సత్కరించారు.

ఉచిత శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - మైలవరం : మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్, మోస్ట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం డిజైన్ వర్క్ శిక్షణా తరగతులను సోమవారం స్థానిక మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మోస్ట్ సభ్యులు మాట్లాడుతూ పేద మధ్యతరగతి మహిళల ఆర్థిక అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఉచితంగా అందించే శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ, మోస్ట్ అధ్యక్షులు చనుమోలు వరప్రసాద్, ఉపాధ్యక్షులు అడుసు మిల్లి విటల్ బాబు, జవాజి రామారావు, అమీర్ అంజా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మా భూములను రక్షించండి !

- ఉరిమిలో అక్రమ చెరువుల తవ్వకాలు
- బందరులో భూ ఆక్రమణలకు కార్పొరేషన్ అధికారుల వత్తాసు
- పిట్లలంకలో అక్రమ రిజిస్ట్రేషన్లు
- మీ కోసంలో వినతులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

'మా వ్యవసాయ భూములకు సమీపంలో 36 ఎకరాల్లో అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారు. కాలువలు, డ్రయినేజీల్లో నీటి ప్రవాహానికి ముప్పుగా మారుతోంది. ఇవి పూర్తయితే ఎగువన ఉన్న 200 ఎకరాల వ్యవసాయ భూములు వర్షాకాలంలో ముంపుకు గురవుతాయి. చెరువు తవ్వకాలను నిలిపివేయాలి.' అని పెడన మండలం ఉరిమి గ్రామానికి చెందిన పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు మచిలీపట్నం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో సోమవారం జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. రొయ్యలకు వాడే ఉప్పునీటి కాలుష్యంతో ఏనుగుంటలంక ప్రాంతానికి చెందిన పంట పొలాలు చౌడు బారిపోతాయని ఉరిమి గ్రామానికి చెందిన గంథం నాగేశ్వరరావు, ఉంగరాల రామ్మోహనరావు తదితరులు అధికారులకు సమస్యను వివరించారు. మచిలీపట్నం 46 డివిజన్‌లో తమ స్వంత భూమిలో ఇతరులు షెడ్ నిర్మించుకోవడానికి కార్పొరేషన్ అధికారులు అనుమతులు ఇచ్చారని, కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని జల్లు రామ్‌నితీష్ వినతిపత్రం అందించారు. కోడూరు మండలం పిట్లలంక గ్రామ పంచాయతీ పరిధిలోని బావిశెట్టివారిపాలెంలోని ఆర్ఎస్ నంబర్ 53-6ఎలోని 50 సెంట్ల ఉమ్మడి చెరువును సోదరుని కుమారునిపేరుతో చేసిన అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, అడంగల్‌లో మారిన పేర్లను తిరిగి సవరించాలని ఆ గ్రామానికి చెందిన బావిశెట్టి వెంకట నాంచారయ్య అధికారులకు వినతిపత్రం అందించారు.

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రజల నుండి అందే అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో సానుకూలంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశ హాలులో మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం జరిగిన మీకోసం కలెక్టరేట్లో మొత్తం 181 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. అలాగే ఇప్పటివరకు 20,390 అర్జీలు అందగా అందులో 18,384 పరిష్కరించారని, పెండింగ్లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు క్లస్టర్ పరిధిలోని 91 పాల సంఘములకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి మూడో విడత నాలుగు నెలల బోనస్ రూ.97,66,811 చెక్కులను కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు అర్జా వెంకట నగేష్, వల్లభనేని భాస్కర కుటుంబ, వెంకట సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. సోమవారం స్థానిక పాలశీతలీకరణ సమావేశపు మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో నగేష్ మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో డైరీ మరింత అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాగిత జయరాం, ఫీడ్ సభ్యులు మోతుకూరి వెంకటేశ్వరరావు, గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలంలో బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 900 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపిడిఓ సిహెచ్.వెంకటేష్ ఆధ్వర్యంలో అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు.

రహదారిపై నిలిచిన లారీ

ప్రజాశక్తి-గన్నవరం: బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామ సమీపంలోని రహదారిపై సోమవారం సాంకేతిక కారణాలవల్ల భారీ లోడ్‌తో వెళ్తున్న లారీ నిలిచిపోయింది. ఇదే సమయంలో గుడివాడలో జరుగుతున్న ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి దెందులూరు వస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ట్రాఫిక్ అంతరాయంతో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఎంఎల్ఎ తన అనుచరులతో కలిసి లారీని పక్కకు తోసి ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా చేశారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-నందివాడ : నందివాడ మండలం జనార్ధనపురం (జొన్నపాడు) గ్రామంలో రూ.43 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం వెనిగండ్ల రామకృష్ణతో కలిసి రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అభివృద్ధికి దూరమైన గ్రామాల్లో కోట్లాది రూపాయలతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు జరిగాయన్నారు. ముఖ్యంగా గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల వ్యవధిలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగినట్లు రావి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, గుడివాడ అధ్యక్షుడు దిట్యాల రాంబాబు, రూరల్ అధ్యక్షుడు వాసే మురళి, నాయకులు చేకూరు జగన్మోహన్‌రావు, యార్లగడ్డ రవి, చాట్రగడ్డ రవి, సింగరాల రాధాకృష్ణ, ఎంపీడీవో మల్లీశ్వరి పాల్గొన్నారు.

చెరువులకు తాగునీరు విడుదల

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: రానున్న వేసవి దృష్ట్యా బందరు సబ్ డివిజన్ పరిధిలోని పంచాయతీ చెరువులు, ఊరచెరువుల్లో తాగునీరు నింపుకునేందుకు సోమవారం కాల్వల ద్వారా నీటిని విడుదల చేయడం జరిగిందని ఇరిగేషన్ డిఈటి వీరాంజనేయులు తెలిపారు. ఈ నెల 10 నుండి 20 వరకు నీటిని నింపుకోవాలని తెలిపారు. కాల్వల ద్వారా సరఫరా అయ్యే ఈ నీటిని రొయ్యల చెరువులు, చేపల చెరువులకు మళ్లించి నీటి చౌర్యంకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాచవరం మేజర్‌కు నీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గన్నవరం: మాచవరం మేజర్ వద్ద సాగర్ జలాలను నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు ఎన్ఎస్‌పి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు బ్రాంచ్ కాలువ నుంచి తీవ్ర నీటి ఎద్దడి ఉన్న దృష్ట్యా మాచవరం మేజర్‌కు కేవలం 90 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయని, ఈ నీటి పరిమాణాన్ని 300 క్యూసెక్కులకు పెంచి ఏప్రిల్ 20 వరకు సాగునీటిని విడుదల చేయాలని అన్నారు. మాచవరం మేజర్ గుండా సాగర్ జలాలు ప్రస్తుతం నూజివీడు నియోజకవర్గం శోభనాపురం వరకే వచ్చాయని, ఇంకా దిగువ ప్రాంతం గన్నవరం నియోజకవర్గంలోని గొల్లనపల్లి, కొండపావులూరు, సూరంపల్లి, నున్న నీటి సంఘాల పరిధిలో ఆరుతడి పంటలకు, తాగునీటి చెరువులకు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ ఉప్పు వెంకటేశ్వరరావు, రెడ్డిగూడెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొల్లి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ యర్రా వెంకట శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వై.నవీన్‌బాబు, కే.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి-నాగాయలంక స్థానిక ఒకటో వార్డుకు చెందిన వేములపల్లి విజయలక్ష్మి (70) అనారోగ్యంతో మరణించారు. ఆమె నేత్రాలను మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో కొడుకు వేముపల్లి హేమప్రసాద్, కూతురు కుసుమకుమారి ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రికి అందజేశారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గన్నవరం: కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురంలో డ్రైనేజీల్లో పూడికతీత పనులను సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ చేట్రోలు లక్ష్మీ మౌనిక ఈ పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి దోమలకు నిలయంగా మారడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ వెంటనే పనులు చేయించడానికి రంగంలోకి దిగారు. పంచాయతీ సిబ్బందిని పెట్టి మురుగు కాలవల్లో చెత్తాచెదారం తీయిస్తున్నారు. కాలవలో పెరిగిన పచ్చగడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు : సురేఖ

ప్రజాశక్తి-గుడివాడ : చదువే ఇంటికి వెలుగు అని, చదువుంటేనే సమాజంలో గుర్తింపు అని దొండపాడు గ్రామ సర్పంచ్ చోరగుడి సురేఖ అన్నారు. సోమవారం లేప్రసీ ఇండియా ట్రస్ట్ చెన్నై, రాజా రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో దొండపాడులోని చెంచుల కాలనీలో నిర్వహించారు. చదువురాని నిరక్షరాశులైన పెదపారుపూడి వంతెన, ఈదుల మద్దాలి, మొదలైన గ్రామాలలోని ఎరుకుల తదితర కులానికి చెందిన వారికి చదువు పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ నిరక్షరాసులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌యుడిఎస్ అధ్యక్షులు లంకపల్లి పురుషోత్తంబాబు, ప్రాజెక్ట్ ఆఫీసర్ దేవరకొండ వరలక్ష్మి, టీచర్ ధనికొండ నాగలక్ష్మి పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-నందివాడ: మండలంలోని జనార్ధనపురం గ్రామపంచాయతీ పరిధిలో మలిరెడ్డి ఫకీర్ రామదాసురెడ్డి వాటర్ ప్లాంట్‌ను నూతనంగా ప్రారంభించారు. ఐదు రూపాయలకే ఇరవై లీటర్ల వాటర్ క్యాన్ ఇస్తున్నామని గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని నిర్వాహకులు మలిరెడ్డి నాగభూషణ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి ఉమా శంకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు అంజిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నీలం మురళీకృష్ణారెడ్డి, బాబిరెడ్డి, సరిపల్లి ఉమాశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

పృథ్వీశ్వర స్వామి ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-చల్లపల్లి: పృథ్వీశ్వర స్వామి క్షేత్రం సందర్శించే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ వాసు తెలిపారు. సోమవారం చల్లపల్లి మండలం నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం శ్రీ పృథ్వీశ్వర స్వామి వారి దేవస్థానాన్ని యాత్రికులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. వంశపారంపర్య అర్చకులు మామిళ్లపల్లి హేమంత్ కుమార్ శర్మచే స్వామివారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఏర్పాట్లను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈఓ వాసు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ అభిముఖంగా ఉండే ఈ ప్రాచీన దేవస్థానంలోని శ్వేత వర్ణ శివలింగాన్ని సాయంత్రం వేళ సూర్యకిరణాలు తాకిన నాటి నుంచి స్వామివారిని దర్శించుకునే యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు.

మంచినీటి కోసం బిందెలతో నిరసన

ప్రజాశక్తి-చల్లపల్లి: తాగేందుకు మంచి నీరు సరఫరా చేయాలని మహిళలు బిందెలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామానగరం 8వ వార్డులో పంచాయతీ కుళాయిల ద్వారా తాగునీరు సరిగా అందకపోవటంతో, దాహం తీర్చుకునేందుకు తాగునీరు కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు ఉదయం సాయంత్రం ఒక్క గంట మాత్రమే కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారని అన్నారు. కొంతమంది మోటర్లు ఉపయోగించడం వల్ల పంచాయతీ కుళాయిల ద్వారా నీటి సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే తాగునీరు అందక ఇక్కట్లు పడుతున్నామని ఇదే పరిస్థితి కొనసాగితే వేసవిలో దాహం కేకలు తప్పవని మహిళలు ఆందోళన చెందుతున్నారు. వేసవి ప్రారంభంలోనే నీటి సరఫరా సరిగా లేకపోతే దాహం ఎలా తీర్చుకోవాలని పాలకులను, సంబంధిత అధికారులను మహిళలు ప్రశ్నిస్తున్నారు. తాగునీటిని అందించే మోటార్లకు మరమ్మతులను చేయించి ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీరు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఎనిమిదో వార్డులోని మూడు రోడ్లకు మాత్రం పంచాయతీ కుళాయిల ద్వారా పంపిణీ చేసే తాగునీరు అందటం లేదని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మంచి నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. పంచాయతీ పైపులైన్ల నుండి కనెక్షన్ తీసుకున్న మోటార్లను కట్టడి చేయాలని కోరుతున్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పంచాయతీ కార్యాలయం వద్ద నిరసనకు సిద్ధపడతామని సిపిఎం మండల పార్టీ కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శి లంకపల్లి సత్యనారాయణ సంబంధిత అధికారులను, పాలకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా పాల్గొన్నారు.

మంచినీటి కోసం నిరసన తెలుపుతున్న మహిళలు

పాసు పుస్తకాలు ఇవ్వండి

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని చిన్న నందిగామకు చెందిన 19 మంది రైతులకు 1977వ సంవత్సరంలో ప్రభుత్వం వారికి సీలింగ్ భూమిని ఇచ్చింది. ఆ భూమికి సంబంధించిన పాసు పుస్తకాలను ఇవాలంటూ జి.కొండూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘ జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ రైతులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావుకు రైతుల సమస్యలను వివరించారు. 2012వ సంవత్సరం నుండి అనేకమార్లు ప్రభుత్వానికి తమ గోడు చెప్పుకుంటూ వస్తున్నామని ప్రభుత్వాలు మారిన రైతుల సమస్య పరిష్కారం అవడం లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి పాసు పుస్తకాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల మాజీ కార్యదర్శి పంది సాంబశివరావు, జి.కొండూరు సిపిఎం శాఖ కార్యదర్శి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మున్సిపల్ కమిషనర్ ఈ వీ రమణబాబు ఆదేశాల మేరకు నందిగామ పట్టణంలోని వీధి కుక్కలను సోమవారం పట్టుకున్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ నిమిత్తం వీధి కుక్కలు పట్టుకొని విజయవాడకు తరలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎటిఎం కార్డు మార్చి నగదు దోపిడీ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో ఎటిఎం కార్డు మార్చి డబ్బులు మాయం చేసి డ్రా చేసిన సంఘటన సోమవారం నందిగామలో జరిగింది. నందిగామ పట్టణంలో నివాసం ఉంటున్న అనంతుల లక్ష్మీరాజ్యం అనే వృద్ధురాలు 4న శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో డబ్బులు తీసేందుకు నందిగామ పట్టణంలోని మెయిన్ బజార్‌లో రిజిస్టర్ ఆఫీస్ పక్కనగల ఎటిఎంకి వెళ్లింది. డబ్బులు తీయడంలో ఇబ్బందిగా ఉండటంతో అక్కడ ఉన్న ఒక వ్యక్తికి ఏటీఎం కార్డు ఇచ్చి, పిన్ నెంబర్ చెప్పి డబ్బులు తీసేందుకు సహాయం కోరగా అతను వృద్ధురాలికి చెందిన ఎటిఎం నుంచి డబ్బులు డ్రా చేసాడు. అతని ఎటిఎం ఆమెకిచ్చి ఆమె ఎటిఎంలో డబ్బులు లేవని నమ్మబలికాడు. ఆమె ఇంటికెళ్లాక ఆ ఎటిఎం మారిపోయినట్టు గుర్తించింది. సోమవారం బ్యాంకుకు వెళ్లగా రూ.40వేలు డ్రా చేసినట్లు బ్యాంకువారు తెలిపారు. బ్యాంకు అకౌంట్‌ను హోల్డ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని బ్యాంకు మేనేజర్ వృద్ధురాలికి సూచించారు.

ఉత్తరాయుడు చెరువు గండి పూడ్చాలని వినతి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : అట్ల ప్రగడ గ్రామ రెవెన్యూ పరిధిలోని పెళ్లి కొడుకు గుట్టబండ్ల గుట్ట మధ్యలో ఉన్న ఉత్తరాయుడు చెరువుకు రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు గండి పడిందని ఆ గండిని పూడ్చకపోవడం వల్ల చెరువు కింద సాగుతున్న మాగాణి భూములు బీడు భూములుగా మారాయని జిల్లా రైతు సంఘం నాయకులు శనగల రామకృష్ణారెడ్డి అన్నారు. చెరువుకు గండిపడి చెరువులో నీరు లేకపోవడం వల్ల చెరువుకు సమీపాన ఉన్న పంటపొలాల్లో బోరు బావులు కూడా ఎండిపోయి మిర్చి మొక్కజొన్న లాంటి పంటలు నీటి ఎద్దడితో ఎండిపోయాయన్నారు. ఎ.కొండూరు అట్ల ప్రగడ కంభంపాడు గ్రామాలకు చెందిన రైతులు తమ పశువులను ఈ చెరువుకు సమీపానమున్న కొండగుట్టలకు పశువులను మేకలను గొర్రెలను మేతకు తోలుకు వెళతారని చెరువులో నీరు లేకపోవడం వల్ల మూగజీవాలు కూడా అల్లాడిపోతున్నాయని అన్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కౌలురైతు సంఘం రైతులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు పి.ఆనందరావు డి.చిన్న లక్ష్మారెడ్డి ఎస్‌వికె.రెడ్డి, పి.ప్రభాకర్ రెడ్డి, బి.శ్రీను చావ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పెదరాయుడు చెరువుకు పడిన గండి

రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ : గొల్లపాలెంగట్టు, మహంతీపురం ప్రాంతాల్లో పెండింగ్లో ఉన్న రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరుతూ ఎసిజి చంద్రశేఖర్‌కు 50 డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్నే సాహెబ్ వీధి గత నెల రోజులుగా సీసీ రోడ్డు పనులు నిలుపుదల చేయడం వల్ల ప్రజల రాకపోకలు సాగించేందుకు ప్రమాదాలకు లోనవుతున్నారన్నారు. జడ పాపాయి వీధి సిసి రోడ్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్‌సిఎం స్కూలు వెనుక భాగం, జండా చెట్టు ఏరియాలో ఉన్న రోడ్లు పనులు కూడా త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

పలు సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణంలో సిపిఎం ఇటీవల నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో తాగునీరు, డ్రైనేజీ, కోతుల సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు ఆపార్టీ నాయకుల ముందు మొరపెట్టుకున్నారు. సుమారు 50 వేల జనాభా నివసిస్తున్న పట్టణంలో తాగు నీరు మూడ్రోజుల కొక్కసారి సరఫరా అవుతుంది. ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాల్సిన నగర పంచాయతీ పాలకవర్గం విఫలమవుతుంది. తిరువూరు పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పేదల అధికంగా నివసిస్తున్న సుందరయ్య కాలనీ, భగత్‌సింగ్ కాలనీ చింతల కాలనీ తంగళ్ళ బీడు, అప్పనాల పేట, రాజుపేట కొత్త కాలనీ, పీటీ కొత్తూరు బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో కచ్చా డ్రెయిన్లు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారు. దీనితో వర్షాకాలంలో ఈ ప్రాంతాలన్నీ జలమయంతో నిండిపోతున్నాయి. డ్రైనేజీలు నిర్మిస్తున్నాం అంటూ ఇదిగో అదిగో చెబుతున్న పాలకవర్గం ఆ దిశగా ప్లానింగ్ కూడా చేయటం లేదని విమర్శ లు వస్తున్నాయి. మరొక ప్రధానమైన సమస్య, కుక్కలు, కోతులు. ఇవి ప్రజలను భయ భ్రాంతు లకు గురిచేస్తున్నాయి. సిపిఎం నాయ కులు, కార్యకర్తలు ప్రజల నుండి వచ్చిన ఈ సమస్యలనైనా తక్షణమే పరిష్కరించమని నగర పంచాయతీ కార్యాలయం నందు ధర్నా చేసి కమిషనర్ కు ఇందు పత్రం అందజేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించి రానున్న వర్షాకాలం నాటికి దిగువ ప్రాంతాలు జలమయ్యం కాకుండా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు కమిషనర్ లోవరాజు కు విజ్ఞప్తి చేశారు.

మట్టి తవ్వకాల ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని చెవుటూరు గ్రామంలో ని ముచ్చేవాని చెరువులో కొంతకాలం నుంచి అక్రమ మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. ఇటీవల పత్రికలో వచ్చిన కథనాలకు సిపిఎం మండల మాజీ కార్యదర్శి పంది సాంబశివరావు, జి.కొండూరు శాఖా కార్యదర్శి ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అర్ధరాత్రి వేళ అక్రమంగా చెరువులో మట్టి తవ్వుతున్నారని, ఏళ్లకాలంగా ఉన్న తుమ్మ చెట్లు చుట్టూ మట్టి తవ్వడం వల్ల కొంతకాలానికి అవి నేలకొరిగి పోతున్నాయన్నారు. చెరువులోని తుమ్మచెట్లను అక్రమ మట్టి తవ్వకం దారులు తొలగించి స్థానికంగా ఉన్న ఇటుక బట్టీలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. 53 ఎకరాలు పైగా ఉన్న ఈ చెరువులో ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ పెద్ద పెద్ద గోతులు పెట్టి మట్టి తరలించారన్నారు. అక్రమ మట్టి తోలకందారులపై గ్రామ సర్పంచ్, రెవెన్యూ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపైన తహశీల్దార్, జిల్లా కలెక్టర్ స్పందించి గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామంలో పొక్లైన్లు ఉన్నవారికి కౌన్సిలింగ్ ఇచ్చి చెరువులో గాని గ్రామంలో ఎక్కడ గాని మట్టి తవ్వకాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ విషయై తహశీల్దార్ చాట్ల వెంకటేశ్వరరావును వివరణ కోరగా వారం నుంచి పత్రికల్లో వచ్చిన వార్తలకు ఒక కమిటీ వేసి నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాత్రులు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు విఆర్‌ఒలు పర్యటిస్తున్నట్లు తెలిపారు.

వ్యూహాత్మక ఆలోచనలతో వ్యాపారాభివృద్ధి

మాట్లాడుతున్న సిఇఒ డి.శరత్ కుమార్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మారుతున్న వినియోగదారుల ఆలోచనలు, అవసరాలకు అనుగుణంగా వ్యూహాత్మక పద్ధతుల్లో వ్యాపారాన్ని నిర్వహించినప్పుడే వ్యాపారసంస్థలు అభివృద్ధి చెందుతాయని ప్రముఖ వ్యాపారవేత్త సంస్థ సిఇఒ డి.శరత్ కుమార్. కెబిఎన్ కళాశాల పి.జి విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఎం.బి.ఎ విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలపై అవగాహన కలిగించే 'మీట్ ద సిఇఒ' కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శరత్ కుమార్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రెజెంటేషన్ స్కిల్స్ కూడా ప్రొఫెషనల్ జీవితంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. పి.జి. విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మార్కెట్ విశ్లేషణ, పోటీదారులపై అవగాహన కలిగించేందుకు ప్రాజెక్టులు, కేస్ స్టడీలను వినూత్నంగా సమర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన ఇంటరాక్టివ్ సెషన్‌లో విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు శరత్ కుమార్ లైవ్ ఉదాహరణల ద్వారా విశ్లేషణ చేస్తూ సమాధానాలు చెప్పారు. ఎంబిఎ విభాగాధిపతి రవికిరణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీ నగరాల సీతారామస్వామి రథోత్సవం

ప్రజాశక్తి - వన్ టౌన్ :

శ్రీరామనవమి సందర్భంగా సోమవారం సాయంత్రం కొత్తపేటలో శ్రీ నగరాల సీతారామస్వామి వార్ల రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సిబిఐ స్పెషల్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంప్రసాద్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రథోత్సవంలో బంక కొండలరావు బేతాళం నుంచి బృందం వారి గజకర్ణ గోకర్ణ ,టక్కు టమారి విచిత్ర వేషధారణలు, బేతాళ నృత్యాలు యాత్రికులను అలరించాయి. సింహాద్రి సేవాసమితి, పోతిన దాసు సేవా కమిటీ వారు కనక తప్పెట్లను ప్రదర్శించారు. రథోత్సవం జరిగిన వీధులన్నీ జైశ్రీరామ్ నినాదాలతో మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో నగరాల సీతారామస్వామి మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానం కమిటీ అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు (పిసి), దేవస్థానం కమిటీ ఉపాధ్యక్షులు మరుపిళ్ళ సత్యనారాయణ, బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులు పొట్నూరి రాజా, శీరం వెంకటరావు,ఆర్గనైజింగ్ సెక్రటరీ కొరగంజి భాస్కరరావు, కమిటీ సభ్యులు పోతిన సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మున్సిపల్ పరిధిలో మంచినీటి ట్యాంకుల సముదాయం వద్ద, కీసర పంపింగ్ స్కీం దగ్గర చేపట్టిన నిర్మాణ పనులను చైర్ పర్సన్ మండవ కృష్ణ కుమారి సోమవారం సందర్శించారు. ప్రస్తుతం నందిగామ పట్టణ పరిధిలో ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను త్వరగా నివారించాలని పట్టణ ప్రజలకు త్వరలోనే తాగునీటి సమస్య నుంచి అధిరోహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, రంగారావు, గర్మిడి సతీష్, పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి - తిరువూరు : విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ ఫైన్ ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్ట్ నిర్వహించిన 12వ అల్ ఇండియా యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్ కాంపిటీషన్‌లో తిరువూరులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. 12 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, 13 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకున్నారని ప్రిన్సిపాల్ కోటిరెడ్డి తెలిపారు. గెలు పొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆస్తి పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ

ప్రజాశక్తి - నందిగామ : ఆస్తి పన్నులు ఏకమొత్తంగా చెల్లించి 5శాతం రాయితీ పొందుటకు సువర్ణ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ ఇవి రమణ బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నందిగామ పురపాలక సంఘ పట్టణ ప్రజలకు ముఖ్య గమనిక 2025-26 మొదటి, రెండో అర్ధ సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను బకాయిలు వన్ టైం సెటిల్‌మెంట్ పద్దతిన ఏక మొత్తంలో చెల్లింపు చేసి 5శాతం రాయితీ పొందు సువర్ణ అవకాశం ఉందని తెలిపారు. ఈ సదావకాశ ఏప్రిల్ 30వ తేదీ లోపు పన్ను చెల్లించిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకొని ఏక మొత్తంలో చెల్లింపులు చేసి 5శాతం రాయితీ పొందాలని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు అన్ని రకాల పన్నులు కట్టించుకుంటారని తెలిపారు.

చక్కని ఆరోగ్యంతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - తిరువూరు : మనిషికి అన్నింటికంటే ఆరోగ్యమే అత్యంత ప్రధానమైనదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా యువతకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వి.రవీంద్ర తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జెవివి ఆధ్వర్యంలో సోమవా రం నాగార్జున జూనియర్ కళాశాల లో జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత సరైన ఆహార నియమాు పాటించక పోవడం వల్ల చిన్న వయసులోనే అనారోగ్యం పాలౌతున్నారని, మద్యం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని తెలిపారు. శారీరక వ్యాయామం కూడా అవసరమని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. శేషగిరి రావు, డైరెక్టర్ టీ. సూరి బాబు, జెవివి నాయకులు ఎల్. గంగాధర్, ఎం. హరికష్ణ, ఎం. రాం ప్రదీప్, కె. పాపారావు, డి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లా అధికారులు వారి పనితీరు మార్చుకొని వారికి అప్పగించిన పనులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ సమావేశం మందిరంలో మీకోసం కార్యక్రమానికి ముందుగా జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొందరు జిల్లా అధికారులు వారికి అప్పగించిన పనులను సజావుగా చేయకపోవడం పట్ల జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను నేరుగా గాని, వాట్సఅప్ ద్వారా గాని చెప్పిన సూచనలు తేలికగా తీసుకుంటున్నారని, విధుల్లో నిర్లక్ష్యం పనికిరాదని మందలించారు. ఇకపై తన ప్రతి సూచన తీవ్రంగా తీసుకొని తప్పనిసరిగా పాటించడం నేర్చుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ దత్తత సంస్థ కారా నుండి అనుమతులకు సంబంధించిన దస్త్రాన్ని తీసుకురావాలని చెప్పినప్పటికీ ఐ సి డి ఎస్ పిడి స్పందించకపోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. జల వనరుల శాఖలో సరిగా వకాలత్ వేయకపోవడంతో కోర్టు వారు తనను వ్యక్తిగతంగా హాజరుకావాలని సూచించారన్నారు. ప్రతి ఒక్క అధికారి తన సూచనలు చాలా సాధారణంగా తీసుకుంటున్నారని, నిర్లక్ష్యంగా ఉంటే ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం పథకాలు సమర్థవంతంగా అమలు చేయుటకు అధికారులందరూ కలిసికట్టుగా పనిచేసి అనుకూల ఫలితాలను సాధించాలన్నారు. వాట్సాప్ ద్వారా తానిచ్చే ప్రతి సూచన విధిగా అనుసరించి ప్రాధాన్యతతో నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి ఈఈలు నటరాజు,లోకేష్,డి ఎం హెచ్ ఓ డాక్టర్ శర్మిష్టా, ఐసిడిఎస్ పీడీ వాణి, డిపిఓ అరుణ, గహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, దేవాదాయ శాఖ అధికారి సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎ.నాగరాజ పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించే ల్యాప్‌టాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వికలాంగులను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు మంది వికలాంగ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయో వృద్ధులు మరియు వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి బి.కామరాజు పాల్గొన్నారు.

శివరామయ్య దంపతులకు సత్కారం

ప్రజాశక్తి-మొవ్వ

మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య సుధారాణి దంపతులను సోమవారం మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సత్కరించారు. మొవ్వ మండల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులుగానున్న తాసిల్దార్ కే. మస్తాన్ శాలువాలతో పూలదండతో సత్కరించగా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు జొన్నలగడ్డ హనుమకుమార్, టి.ముక్తేశ్వరరావు, పావులూరి వెంకటేశ్వరరావు, మద్దాల కామేశ్వరరావు, పాగోలు రమేష్ బాబు, కే.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలోని నారాయణ ఇ టెక్నో స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం పాఠశాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎన్ శివశంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లల ప్రతిభ, ఆసక్తి ,అభ్యసన ,సామర్థ్యాలకు అనుగుణంగా ప్రోత్సహిస్తే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. పిల్లల అభ్యాసన సామర్థ్యాన్ని పేరెంట్స్ గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 పిచ్చయ్య, స్కూల్ ఏజీఎం ఎస్ శ్రీనివాసరావు, జోనల్ కోఆర్డినేటర్లు హెప్సిబా, బి మేరీ, శ్రావణి, స్కూల్ ప్రిన్సిపాల్ చందన బాబురావు ప్రసంగించారు. ఏవో ఆర్‌వివి సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈ వేడుకలు జరిగాయి. యూకేజీ నుండి ఒకటో తరగతికి ఐదో క్లాస్ నుండి ఆరో తరగతికి వెళ్లే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రంగారావుకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన ప్రముఖులు తుమ్మల రంగారావును రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ సోమవారం పరామర్శించారు. ఇటీవల గ్రామ పెద్దలు తుమ్మల రాజేంద్రరావు మతి చెందగా వారి కుమారుడు రంగారావును పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లంక దినకర్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరి బాబు, సీనియర్ నాయకులు పరుచూరి సుభాష్ చంద్రబోస్ నాయకులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యుటిఎఫ్ చేస్తున్న కషి ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. యుటిఎఫ్ ముద్రించిన ప్రభుత్వ బడిలో విద్యార్థులు చేర్పిద్దాం' అనే కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ యుటిఎఫ్ నాయకులతో కలసి ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యుటిఎఫ్ చేస్తున్న కషి ప్రశంసనీయం అని కొనియాడారు.ఇలాంటి కషి కొనసాగించాలని సూచించారు.తొలుత కష్ణాజిల్లా విద్యాశాఖ అధికారి పి వి జె రామారావుతో కూడా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయుల శాలరీస్, ఆర్థికపరమైన అంశాలు గురించే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కెఎ ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం డి షౌకత్ హుస్సేన్, బి కనకారావు, గౌరవ అధ్యక్షులు జే లెనిన్ బాబు,జిల్లా కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వరరావు, ఎల్ నరేంద్ర, సిహెచ్ రాజా శ్రీధర్, టి నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, పి రవి వరప్రసాద్ కె రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మచిలీపట్నం తాలూకా యూనిట్ ఎన్నిక సోమవారం వాకర్స్ అసోసియేషన్ హాల్లో జరిగింది. మచిలీపట్నం తాలూకా యూనిట్ అధ్యక్షులుగా పివి పరమేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎండి అలీ అబ్బాస్, సెక్రటరీగా బాల భాస్కర్, ట్రెజరర్‌గా ఎం మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి లోకేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా డి రామ్ కుమార్, శ్రీ శాంత, జీ నాగరాజు, ఏ రమేష్ బాబు, జే శ్యాంబాబు, డి ఆర్ కే శర్మ, జాయింట్ సెక్రటరీగా టి బద్రావతి దేవి, ఎస్ రవీంద్రబాబు, జి నాగ కిరణ్ బాబు, వి శ్రీకాంత్, పివి రవీంద్రబాబు, ఎన్ రత్నకుమారి, గంటా బాలశ్రీ ఎన్నికైనట్లు ఎలక్షన్ ఆఫీసర్‌గా వ్యవహరించిన జిల్లా ట్రెజర్ బిసురేష్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం విజయ కుమార్, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పి రాము, తోట వరప్రసాద్, వై సాయి పనింద్ర తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దొంగల అరెస్టు

ప్రజాశక్తి-ఉంగుటూరు: చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసి 16 కాసుల బంగారాన్ని, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని డిఎస్పీ చలసాని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ గత నెల 31 రాత్రి జరిగిన దొంగతనం కేసులో మంగళగిరికి చెందిన పాత నేరస్తులైన బాష, అతని స్నేహితులపై దృష్టి సారించి అరెస్టు చేశామన్నారు. ప్రధాన నిందితుడైన పటాన్ సలీం బాష గతంలోనే 31కి పైగా చైన్ స్నాచింగ్ నేరాలు చేసి జైలుకు వెళ్లాడని, గుంటూరులో బంగారం వర్క్ షాప్‌లో పనిచేసే మల్లంకొండ రవీంద్రతో చేతులు కలిపి గొలుసులను అమ్మి సొమ్ము చేసేవాడిని తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన మొగల్ బాజీ, రవీంద్ర తమ్ముడు మణికంఠ కూడా గొలుసు దొంగతనాలు చేస్తున్నారని చెప్పారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఆత్కూర్ ఎస్ఐ చావా సురేష్ మరియు సిబ్బందిని అభినందించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కంకిపాడు: కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామపంచాయతీ పరిధిలో పది లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు సర్పంచ్ పి ఇందిర, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, వెంకటేశ్వర ప్రసాద్ సమవారం శంకుస్థాపన చేశారు. వేసవికాలం ఎండలు ఎక్కువగా ఉండటం వలన గ్రామపంచాయతీ తరపున జిల్లా పరిషత్ హై స్కూల్ సమీపంలో చలివేంద్రంను సర్పంచ్ ఇందిరా ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-గుడివాడ: అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ గోకవరపు సునీల్ అన్నారు. సోమవారం స్థానిక ఏలూరురడ్డులోని గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని పెద్దమల్లు వెంకటేశ్వరరావు, కొత్త మురళీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవం ముగింపు సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ ఛైర్మన్ గోకవరపు సునీల్ ప్రారంభించగా నేరెళ్ల సురేష్‌కుమార్, పెద్దమల్లు పద్మావతి, తిరివీధులు సుబ్బారావు, కొత్త సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన కృష్ణా వర్సిటీ విసి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయ అభివద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు.విజయవాడలో విశ్వవిద్యాలయ అనుబంధ పిజి సెంటర్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.విశ్వవిద్యాలయం లో నిర్మాణం జరుగుతున్న భవనాలు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. వీటితో పాటు విశ్వవిద్యాలయంలో ఇతర అభివద్ధి కార్యక్రమాల కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పూల మొక్కలు అందచేశారు.

ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఉద్యోగోన్నతులు మరింత బాధ్యత పెంచుతాయని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నగరంలోని వారి చాంబర్లో ఉమ్మడి కష్ణా జిల్లాలోని గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న వివిధ గ్రేడ్ ల ఉద్యోగులకు ఉద్యోగన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగన్నతులు మరింత బాధ్యత పెంచుతాయని కాబట్టి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఉద్యోగన్నతి పొందిన వారిలో నాలుగో గ్రేడు పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న 19 మందికి, జూనియర్ అసిస్టెంట్లుగా , 18 మందికి మొత్తము 37 మందికి మూడవ గ్రేడు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సంబంధిత పదోన్నతులు పొందిన ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అందజేశారు ఈ కార్యక్రమంలో డిపిఓ జే అరుణ, ఏవో వి.సీతారామయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నాగసూర్యతేజకు డాక్టరేట్

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని విజ్ఞాన విహార్ హై స్కూల్ ప్రిన్సిపాల్ కాశీభట్ల నాగ సూర్య తేజకు ది ఎడ్యు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయగా సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి పెద్ద ప్రసాద్ చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు. విద్యారంగంలో విశేష కృషి చేస్తూ నూతన విద్యా విధానంలో ఎన్నో కొత్త ప్రయోగాలు చేస్తూ అనేక ఆర్టికల్స్ రాస్తూ ముందుకు సాగుతున్న సూర్యతేజను గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్ అందించినట్లు సమస్త సీఈవో తెలిపారు. సూర్యతేజ గత మూడు సంవత్సరాలుగా విద్యార్థుల అభివద్ధికి విశేషమైన కషి చేశారని తెలిపారు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షులు మండలి వెంకట్రాం సూర్యతేజను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫ్రాంచైజ్ రామకృష్ణ నవజీవన విద్యాసంస్థల ఛైర్మన్ కొండవీటి ఈశ్వరరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుడిసే విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నిత్యాన్నదానం పథకానికి సోమవారం భారీగా విరాళాలు వచ్చాయి. తోటవల్లూరు మండలం బద్రిరాజు పాలెంకు చెందిన చాగంటి సాంబిరెడ్డి విజయలక్ష్మి దంపతులు వారి కుమారులు రామచంద్రారెడ్డి పేరు మీద 1,00,116 రూపాయలు, మరో కుమారుడు వేణుగోపాలకృష్ణారెడ్డి పేరు మీద 1,00,116 రూపాయలు చొప్పున దేవస్థానం అధికారులకు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదన్‌రావు దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

మట్టి నమూనా పరీక్షలు

ప్రజాశక్తి-ఘంటసాల: ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బందం దేవరకోట గ్రామం లో మట్టి నమునాల సేకరణ మరియు భుసార పరిక్షల ముక్య ఉద్దేశం పై సాముహిక చర్చ మరియు నైపుణ్య ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా సమన్వయకర్త డా. డి. సుధారాణి మాట్లాడుతూ మట్టి నమూన సేకరణ, మట్టి పరిక్షల వలన ఉపయోగం, భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం గురించి వివరించారు. సస్యపోషణ శాస్త్రవేత్త డా. యం. వెంకట లక్ష్మి మాట్లాడుతూ మట్టి పరీక్షలు చెయ్యడం వలన ఉదజని సూచిక, లవణ సూచిక, నత్రజని, బాస్వరం, పోటాష్ మరియు సూక్ష్మ పోషకాలను ఎంత మోతాదులో ఉంటాయో అలాగే సమస్యాత్మక నేలలు గురిచి మట్టి పరిక్ష చేయడం వలన తెలుస్తుంది అని వివరించారు. కషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల లో భుసార పరిక్షా కేంద్రం లో భుసార పరిక్షలు జరుగుతునాయని అన్నారు. మట్టి పరిక్షలు చేయించుకోవాలి అనుకున్న రైతులు కే.వి.కే, ఘంటసాలవారిని సంప్రదించగలరు అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. కే.రేవతి రైతులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి కలిగించాలి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14,16,18 సంవత్సరాల లోపు విద్యార్థులకు హోప్ ఫెస్ట్ (బాస్కెట్ బాల్ పోటీలు)ను ఆంధ్రా లయోలా కాలేజీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ (బోస్) మాట్లాడుతూ క్రీడలతో శారీరక, దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, మానసిక స్థితి గతి మారుతుందనీ పిల్లలకు తల్లిదండ్రులు చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా ఉండాలని బోస్ అన్నారు. విజయం సాధించాలంటే కృషి, పట్టుదల ఎంతో అవసరమని తల్లిదండ్రులు బాధ్యతగా ఉంటే పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించగలుగుతామని బాస్కెట్ బాల్‌కోచ్ మొహమ్మద్ ఇబ్రహీం తెలిపారు. అండర్ 14 బాయ్స్ ఫైనల్‌లో గన్నవరం సెయింట్ జాన్స్‌పై వీరమాచనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అట్లూరి ప్రణవ్, బండి హనీష్, నాహీద్, తేజా గెలుపొందారు. అండర్ 16 బాయ్స్ ఫైనల్స్ విపిఎస్ ఎ,బిలు తలపడి ఎ.టీమ్ ఛాంపియన్స్‌గాను బాలికల కేటగిరీలో విపిఎస్ ఎ టీం గెలుపొందారు. అండర్ 18బాయ్స్ కేటగిరీలో స్విస్ స్క్వాడ్ టీంలు గెలుపొందారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అట్లూరి ప్రశాంత్ తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలో నగరంలోని వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పూర్ణ రాజేశ్వరి

మహిళల ఆరోగ్యం, జాగ్రత్తలపై అవగాహన

విజయవాడ : తరుణీ తరంగాలు, విజయవాడ, జన శిక్షణ సంస్థాన్, విజయవాడ వారు నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు – ఆరోగ్యం – జాగ్రత్తలు అనే అంశం పై సభ నిర్వహించారు. మధురానగర్ , పుట్ట సెంటర్ లోని జన శిక్షణ సంస్థాన్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కె.పూర్ణ రాజేశ్వరి, మెంబర్, విశ్వ ఆయుర్వేద పరిషత్, కె.శ్రీదేవి, మెంబర్, తరుణీ తరంగాలు, విజయవాడ వారు హాజరు కాగా జన శిక్షణ సంస్థాన్ సంస్థ డైరెక్టరు, పూర్ణిమ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కె.పూర్ణ రాజేశ్వరి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చిన్న పెద్ద అన్న తేడా లేకుండా ఎక్కువ మంది దీర్ఘకాలిక రోగాలతో సతమతమవుతున్నారని తెలుపుతూ, ఈ రోజుల్లో ఆరోగ్యంగా జీవించడం చాలా కష్టతరమైన సమ్యసగా పరిమించిందని, ఎందుకంటే మనం రోజు వారి తీసుకొనే ఆహార పదార్థాలు చాలా మేరకు కల్తీకి గురవుతున్నాయ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జన శిక్షణ సంస్థ డైరెక్టర్, ఎ.పూర్ణిమ, వి. శ్రీదేవి, తరుణీ తరంగాలు, విజయవాడ వారు మాట్లాడుతూ, మనం ప్రతి సంవత్సరం ప్రపంచ ఆరోగ్య దినోత్సం జరుపుకుంటామని దీని ప్రధాన ఉద్దేశం ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయడానికి ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు.

ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మికులతోపాటు ఓలా, బ్లింకిట్, స్విగ్గి, జోమోటో వంటి అన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు ఈ శ్రమ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక నమోదు శిబిరాలపై కార్మిక శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కల్పిస్తున్న ఆరోగ్య, సంక్షేమ, ఆర్థిక (ఎక్స్ గ్రేషియా) ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వివరాల నమోదుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఉపకార్మిక కమీషనర్ సిహెచ్‌ఆషారాణి, డిఆర్‌డిఏ పిడి నాంచారయ్య, విఎంసి యుసిడిపివో వెంకటనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

నేటి నుండి రోబో డ్రోన్ ఫెస్ట్ 2025

60కి పైగా రోబోలతో వినూత్న పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఈ నెల 8,9 తేదీల్లో రాష్ట్రంలోనే తొలిసారిగా రోబో డ్రోన్ ఫెస్ట్ – 2025 నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ ఎస్.వి.ఎన్.రావు తెలిపారు. గురునానక్ నగర్ రోడ్డులోగల స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో నేషనల్ ఇన్నోవేషన్ హబ్ లను తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఆటల్ ఇన్నోవేషన్ స్టార్టప్ ల్యాబ్‌కు దేశంలో అతి కొద్ది పాఠశాలలను ఏర్పాటు చేశారని అందులో తమ పాఠశాల కూడా ఉందని అన్నారు. ఇందులో భాగంగా నీతి అయోగ్ వారి నిబంధనలకు అనుగుణంగా ల్యాబ్ ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. తమ పాఠశాలలో 3డి ప్రింటింగ్ మెషీన్, ఎలక్ట్రానిక్స్, సెన్సర్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్ రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి అధునాతన సాంకేతిక నిపుణులను పాఠశాల నుండి తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో తమ పాఠశాల నందు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. 5వ తరగతి నుండి తొమ్మిదవ తరగతి విద్యార్థులు చదువుతో పాటు నిపుణ్యతను పెంచుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తమ

విద్యార్థులు 60కి పైగా వివిధ ప్రాజెక్టులను రూపొందించారని వాటిని ప్రదర్శనగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ డ్రోన్ ఫెస్ట్ 8,9 తేదీలలో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందని అన్నారు. 8వ తేది ఉదయం 10 గంటలకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, శాసన సభ్యులు గద్దె రామమోహన్ ప్రారంభిస్తారని తెలిపారు.

ఆధునిక వెర్టిగో, ఎపిలెప్సీ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, విజయవాడ ఎంజి రోడ్ శాఖలో ఆధునిక వెర్టిగో, ఎపిలెప్సీ స్పెషాలిటీ క్లినిక్స్‌ను ప్రముఖ న్యూరాలజిస్టులు డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, ప్రిన్సిపాల్, గుంటూరు మెడికల్ కాలేజ్, రిటైర్డ్ మేజర్ జనరల్ డాక్టర్ ఎస్.కుమారవేలు, చీఫ్ న్యూరాలజిస్ట్, ఆస్టర్ రమేష్ గ్రూప్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్.వి.సుందరాచారి మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో వెర్టిగో, ఎపిలెప్సీ కేసులు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజల్లో ఆ వ్యాధులపట్ల అవగాహన కలిగించడం, అపోహలను తొలగించడం, సరైన వ్యాధి నిర్ధారణతో ఖచ్చితమైన వైద్యాన్ని అందించడం ద్వారా రోగికి ఉపశమనం కలిగించాలన్నారు. అన్ని రకాల న్యూరాలజీ వ్యాధులకు వైద్యాన్ని అధునాతన వైద్య పరికరాలతో అందుబాటులోనికి తీసుకు వచ్చినందుకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజ్మెంట్, వైద్య బృందాన్ని అభినందించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ వెర్టిగో, ఎపిలెప్సీ రోగులకు ప్రత్యేకంగా ఆధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక వైద్య విభాగాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎనిమిది మంది న్యూరాలజిస్టులు, ముగ్గురు న్యూరో సర్జన్ల వైద్య బృందంతో పూర్తిస్థాయి న్యూరాలజీ వైద్య విభాగాన్ని, అత్యాధునిక వైద్యపరికరాలతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ క్లస్టర్‌లో ఏర్పాటు చేశామని అన్నారు. న్యూరాలజీలో డి.ఎన్.బి. కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ ఎం.ఎస్.రామమోహనరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, మెడికల్ డ్కెరెక్టర్ డాక్టర్ నాదెళ్ల గిరిబాబు, యూనిట్ హెడ్ డాక్టర్ కారు పాటి సుదర్శన్, క్లస్టర్ మార్కెటింగ్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

క్లినిక్‌ను ప్రారంభించిన వైద్యులు కుమారవేలు

తిరుమలగిరిలో మహిళ హత్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రోకలిబండతో తలమీద కొట్టడంతో వివాహిత మృతిచెందిన సంఘటన మండలంలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మేనవోలు గ్రామానికి చెందిన పసుపులేటి మురళీకష్ణ, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన మంగమ్మ (40) 12 సంవత్సరాల క్రితం ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. మంగమ్మ కి అంతకుముందే తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన వెంకటరత్నం అనే వ్యక్తి తో వివాహం జరిగింది. వెంకటరత్నం, మంగమ్మ లకు ఇద్దరు కుమారులు. కొన్ని అనివార్య కారణాల వలన వారిరువురు విడిపోవడంతో పిల్లలు వెంకటరత్నం వద్దే ఉంటున్నారు. మురళీకృష్ణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ రోజువారి కూలి పని చేసేవాడు. మంగమ్మకు మురళీకృష్ణకు మధ్య తరచూ ఘర్షణలు జరుగుతుండేవని తెలుస్తుంది. మూడు నెలలుగా కనిపించకుండా వెళ్లి ఐదు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన మురళీకృష్ణ గత రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చాడు. మురళీకష్ణ, మంగమ్మల మధ్య ఘర్షణ జరిగింది. సోమవారం తెల్లవారుజామున భార్యపై విచక్షణారహితంగా రోకలిబండతో కొట్టడంతో మంగమ్మ అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలుసుకున్న నందిగామ ఎసిపి తిలక్, జగ్గయ్యపేట సిఐ పి.వెంకటేశ్వరరావు సంఘటనా స్థలం వద్దకు వచ్చి హత్య జరిగిన విధానాన్ని పరిశీలించి, వివరాలడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు 65 మంది హాజరు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : బిసి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరు కోసం మొదటి రోజు నాలుగు గ్రామాలకు చెందిన 65 మంది హాజరయ్యారని ఎంపిడిఒ టికెవి.రమణ తెలిపారు. రోజుకు నాలుగు గ్రామాల చొప్పున ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

కుస్తీలో నున్న విద్యార్థుల హవా

ప్రజాశక్తి ఎడ్యుకేషన్ : తూర్పు గోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ఈనెల 5,6 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రెజ్లింగ్ (కుస్తీ) పోటీల్లో విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు. అండర్ – 15, అండర్ – 20 బాలుర, బాలికల విభాగాల్లో మొత్తం తొమ్మిది పతకాలను పాఠశాల విద్యార్థులు సాధించారు. దీంతో రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ఎన్‌టిఆర్ జిల్లా రెండోస్థానంలో నిలిచింది. పాఠశాలకు చెందిన జీ శైలజ, బి.హేమంత్ సాయి తేజ కుస్తీ పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. టి.స్నేహలత, డీ దీపిక, డీ సంతోష్ రజత పతకాలను కైవసం చేసుకోగా, సీహెచ్ బిందు, టీ వీణా మాధురీ, టీ చిట్టిమ్మ, కె శశాంత్ కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి సోమవారం అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ టి.శ్రీలతను కూడా ఆయన అభినందించారు. నున్న హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ కారణంగా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ఎన్‌టీఆర్ జిల్లాకు రెండోస్థానం లభించడం హర్షణీయమన్నారు.

ఎల్ఐసి పాలసీదారుల సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో మెయిన్ సెంటర్ వద్ద గల ఎవిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన ఆలేటి సైదులుకు చెందిన ఎల్ఐసి పాలసీదారుల సేవా కేంద్రాన్ని సోమవారం ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సత్యప్రసాద్, పిన్నం వెంగళరావు, కొండలరావు, సంజీవరావు, పుల్లారెడ్డి, మాధవరావు, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏజెంట్స్ పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలి

ప్రజాశక్తి - విజయవాడ : అకాల వర్షం రైతులను కోలుకోలేని దెబ్బ తీసిందని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కుందావారి కండ్రికలో కల్లాలు, రహదారులపై నిల్వ ఉంచిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతన్నలకు.. తడిచిన ధాన్యం ఆరబెట్టేందుకు అవుతున్న ఖర్చు తడిచి మోపెడవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.